ప్రజాశక్తి

బుధవారం 6 సెప్టెంబర్ 2023 5

పార్వతీపురం మన్యం

గిరిజన ఆశ్రమ పాఠశాలలు ఏర్పాటు చేయాలి

సాలూరు : నియోజకవర్గ పరిధిలోని సాలూరు పట్టణం,మక్కువ మండల కేంద్రాల్లో గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర, బాలికల పాఠశాలను వెంటనే ఏర్పాటు చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎన్వై నాయుడు, ఎం.శ్రీనివాసరావు కోరారు. మంగళవారం వారు మండల తహశీల్దార్ కార్యాలయానికి వచ్చిన ఐటిడిఎ పిఒ విష్ణు చరణ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఐటిడిఎ పరిధిలో ఉన్న అన్ని మండల కేంద్రాల్లో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు ఉన్నాయని, సాలూరు, మక్కువ మండల కేంద్రాల్లోలేవని చెప్పారు. గిరిజన బాలుర, బాలికలకు అందుబాటులో ఉండేలా పాఠశాలలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సాలూరు, గుమ్మ లక్ష్మీపురంలో ఉన్న వైటిసిలను గిరిజన యువతకు ఉపాధి, శిక్షణ కల్పన కేంద్రాలుగా వినియోగించుకోవాలని కోరారు. గత 29నెలలుగా వైటిసి సిబ్బందికి జీతాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. వైటిసిల నిర్వహణకు ఐటిడిఎ ప్రత్యేక బడ్జెట్ కేటాయింపు చేయాలని కోరారు.

వర్షం వచ్చినప్పుడల్లా... మురుగునీటి ముంపే

- ఏడాదిగా అపార్ట్‌మెంట్ వాసుల ఇక్కట్లు
- పట్టించుకోని మున్సిపాలిటీ
- డిప్యూటీ సిఎంకు ఫిర్యాదు చేసినా దిక్కులేదు

అపార్టుమెంట్ చుట్టూ నిల్వ ఉన్న మురుగునీరు

ప్రజాశక్తి - సాలూరు

పట్టణంలోని గాంధీనగర్‌లో అపార్ట్‌మెంట్ వాసులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. గత ఏడాదిగా వారు మురుగునీటి ముంపుతో ఇబ్బంది పడుతున్నారు. భారీ వర్షం వచ్చినప్పుడల్లా మురుగునీటి ప్రవాహం అపార్ట్‌మెంట్ సెల్లార్‌లోకి చేరుతుంది. దీంతో ఈ అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్న 25కుటుంబాలు నరకయాతన అనుభవిస్తున్నారు. పట్టణంలోని శివాజీ సెంటర్ నుంచి వచ్చే ప్రధాన కాలువ ద్వారా మురుగునీరు వేగావతి నదిలోకి ప్రవహించాల్సి ఉంది. దీనికి మురుగునీటి కాలువ కూడా గాంధీనగర్ వీధి గుండా ఉంది. అయితే ఈ కాలువపై ఇళ్లు నిర్మించడంతో దాని నుంచి పూడికతీతలు గత కొంతకాలంగా జరగడం లేదు. భారీ వర్షాలు పడినప్పుడల్లా మురుగునీరు, వర్షపు నీరు ఉధృతంగా ప్రవహించడంతో లోతట్టు ప్రాంతంలోని అపార్ట్‌మెంట్ సెల్లార్‌లోకి చేరుతోంది. ఆ క్రితం వరకు అపార్ట్‌మెంట్ వాసులకు లేని ముంపు సమస్య ఇప్పుడు తలనొప్పిగా మారుతోంది. అపార్ట్‌మెంట్ వెనుక ఉన్న ప్రయివేటు స్థలాలు గతంలో లోతట్టు ప్రాంతంలో ఉండేవి. ముంపునీరు ఆ స్థలాల మీదుగా పొలాల్లోకి చేరుతుండేది. అయితే ఆ స్థలాల యజమానులు లోతట్టు ప్రాంతంలో ఉన్న స్థలాలను మట్టితో కప్పి ఎత్తు చేశారు. ఫలితంగా మురుగునీరు, వరదనీరు కలిసి అపార్ట్‌మెంట్‌సెల్లార్ లోకి చేరుతోంది. అపార్ట్‌మెంట్ చుట్టూ ఉన్న ప్రహరీగోడ శిథిలమవ్వడంతో నీరు సెల్లార్‌లోకి చేరుతోంది. ఈ నీటిని అపార్ట్ మెంట్ వాసులు వారి ముందు నిర్మాణంలో ప్రయివేటు ఆసుపత్రి స్థలంలోకి వదులుతున్నారు. దీంతో తన ఆసుపత్రి నిర్మాణ పనులకు ఆటంకం కలుగుతోందని ప్రయివేటు వైద్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆసుపత్రి నిర్మాణ స్థలంలోకి చేరుతున్న నీటిని వర్షం వచ్చినప్పుడల్లా మోటార్లతో తోడించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోందన్నారు. దీని వల్ల తనకు ఖర్చు తడిసి మోపెడవుతోందని ఆ వైద్యుడు చెబుతున్నారు. దీనికి శాశ్వత పరిష్కారం చూపాలని అపార్ట్‌మెంట్‌వాసులు గత కొంతకాలంగా ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు, జిల్లా అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. అయినా పరిష్కారం లేదు.

అపార్ట్‌మెంట్‌కు అడ్డగోలు అనుమతులు

2011లో నిర్మాణమైన అపార్ట్‌మెంట్‌కు అప్పటి మున్సిపల్ అధికారులు అడ్డగోలు అనుమతులు మంజూరు చేసినట్లు తెలుస్తోంది. అపార్ట్‌మెంట్‌లో వున్న కుటుంబాలు వాడుక నీరు బయటకు పోయే మార్గం చూపించలేదు. దీనికి తోడు శివాజీ సెంటర్ నుంచి వచ్చే ప్రధాన కాలువ మురుగునీరు వరదనీరు లోతట్టు ప్రాంతంలో ఉన్న అపార్ట్‌మెంట్ సెల్లార్ లోకి చేరుతోంది. మురుగు నీరు, వరద నీరు కలిసి వేగావతి నదిలోకి ప్రవహించేలా కాలువని మున్సిపల్ అధికారులు నిర్మించాల్సి వుంది. అయితే దానికి సరిపడే నిధులు మున్సిపాలిటీ లో లేవని ఇంజనీరింగ్ అధికారులు చేతులెత్తేస్తున్నారు. సుమారు 12ఏళ్ల క్రితం నిర్మించిన అపార్ట్ మెంట్ వాసులు మున్సిపాలిటీ కి అన్ని రకాల పన్నులు చెల్లిస్తున్నారు. కానీ వారి మురుగునీటి పారుదల సమస్యకు పరిష్కారం చూపడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు.

అనుమతులిస్తే డ్రైనేజీ ఖర్చు భరిస్తాం

అపార్ట్ మెంట్ వాసులకు, ప్రయివేటు ఆసుపత్రి నిర్మాణానికి ఇబ్బంది లేకుండా మురుగునీరు వరదనీరు వేగావతి నదిలోకి ప్రవహించేలా కాలువని నిర్మిస్తే తాము కొంత భరిస్తామని బాధిత కుటుంబాలు, ఆసుపత్రి నిర్మాణదారు చెప్తున్నారు. సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

డిప్యూటీ సిఎంకు ఫిర్యాదు చేసినా పరిష్కారం కాలేదు

పట్టణంలో గడపగడపకూ ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా డిప్యూటీ సిఎం రాజన్నదొర ఆ వార్డులో పర్యటించిన సమయంలో అపార్ట్‌మెంట్ వాసులు ఫిర్యాదు చేశారు. తాము ఎదుర్కొంటున్న సమస్యల్ని పరిష్కరించాలని కోరారు. సమస్యలు విన్న రాజన్నదొర అక్కడే ఉన్న కమిషనర్ హెచ్.శంకరరావు పై ఆగ్రహం వ్యక్తం చేశారు. డ్రైనేజీ మార్గం లేకుండా అపార్ట్‌మెంట్‌కు ఎలా అనుమతులు మంజూరు చేశారని ప్రశ్నించారు. అప్పటి అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇది జరిగి ఆరునెలలు కావస్తోంది. అయినా సమస్యకి పరిష్కారం లేదు.

మున్సిపాలిటీలో నిధుల్లేవు: సూరి నాయుడు, ఇన్‌ఛార్జి డిఇ

అపార్ట్‌మెంట్ వాసుల సమస్య పరిష్కారం జరగాలంటే మురుగునీరు వేగావతి నదిలోకి ప్రవహించేలా కచ్చా డ్రెయిన్ నిర్మించాలి. దీనికి నిధులు లేవు.

సర్వేపల్లి రాధాకృష్ణన్‌కు నివాళ్లు అర్పిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్, ఎమ్మెల్యే జోగారావు; అవార్డులను అందుకున్న జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులు

ఉపాధ్యాయుల కృషితో ఉత్తమ ఫలితాలు : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ఉపాధ్యాయుల కృషితో జిల్లాలో ఉత్తమ ఫలితాలు సాధించామని కలెక్టర్ నిశాంత్ కుమార్ అన్నారు. జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం కార్యక్రమం పట్టణంలో "సి" కన్వెన్షన్ సెంటర్‌లో మంగళవారం జరిగింది. తొలుత మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి కలెక్టర్ నిశాంత్ కుమార్ పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం 68 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జీవితంలో గొప్ప మార్పు తీసుకురా గల శక్తి ఉపాధ్యాయుడిదేన్నారు. జిల్లాలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థుల కృషి వల్ల రాష్ట్ర స్థాయిలో టెన్త్ ఫలితాల్లో మొదటి స్థానంలో నిలిచామన్నారు. రాష్ట్ర స్థాయిలో 8 పాఠశాలలు ఉత్తమ పాఠశాలలుగా ఎంపిక కాగా, అందులో 4 పాఠశాలలు మన జిల్లా నుండి ఉండడం గర్వంగా ఉందన్నారు. వచ్చే విద్యా సంవత్సరంలో కూడా ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు. ఎమ్మెల్యే అలజంగి జోగారావు మాట్లాడుతూ ఉపాధ్యాయులు బాధ్యతాయుతంగా ఉండాలని, గురువుకు మించిన పాత్ర పుస్తకాల్లేవని తదనుగుణంగా బోధన చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ బి.గౌరీశ్వరి, డిఇఒ ఎన్.ప్రేమకుమార్, గిరిజన సంక్షేమశాఖ డిడి కె.శ్రీనివాసరావు, డిపిఆర్ఒ ఎల్.రమేష్, డిప్యూటీ డిఇఒ విజయ కుమారి, అవార్డు గ్రహీతలు పాల్గొన్నారు.

సీతంపేట : ఐటిడిఎలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పిఒ కల్పనా కుమారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సర్వేపల్లి రాధాకష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించి, అభినందించారు. కార్యక్రమంలో ఎపిఒ రోసిరెడ్డి, డిప్యూటీ డిఇఒ లిల్లీరాణి, డిడి శ్రీనివాసరావు, ఎటిడబ్ల్యుఒలు మంగవేణి, కృష్ణవేణి, ఎఎంఓ కోటిబాబు, జిసిడిఒ రాములమ్మ, స్పోర్ట్స్ ఇంచార్జ్ జాకబ్, దయానంద్ సూపరిండేట్లు దేశ్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

యుటిఎఫ్ ఆధ్వర్యాన ఉపాధ్యాయుల నిరసన

ప్రజాశక్తి - కలెక్టరేట్

ఉపాధ్యాయులకు 3 నెలల నుంచి జీతాలు చెల్లించకుండా, కేడర్ స్ట్రెంగ్త్ పేరుతో ప్రభుత్వం కపట నాటకం ఆడుతుందని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహనరావు అన్నారు. మంగళవారం స్థానిక డిఇఒ కార్యాలయం వద్ద యుటిఎఫ్ ఆధ్వర్యంలో నల్ల బెలూన్లతో ఉపాధ్యాయులు నిరసన చేపట్టారు. జీతాలు చెల్లించకుండా ఉపాధ్యాయులను అగౌరవంతో ప్రభుత్వం చూస్తోందని, మరో ఉపాధ్యాయ దినోత్సవాల పేరున టీచర్లను సన్మానించడం సిగ్గు చేటన్నారు. గతంలో పిఆర్‌సి ఇచ్చేటప్పుడు ఏ ఉద్యోగి బిల్లు పెట్టకుండానే జీతాలు వేసేవారని, ఇప్పుడు కేడర్ స్ట్రెంగ్త్ అప్డేట్ కాలేదని జీతాలు చెల్లించకపోవడం దారుణమన్నారు. అలాగే జూన్‌లో బదిలీల తర్వాత వెయ్యి మందికి అక్రమ బదిలీలు జరిపిన ప్రభుత్వం కౌన్సిలింగ్ ప్రక్రియకు తూట్లు పొడిచిందని విమర్శించారు. తక్షణమే జీతాలు వెంటనే చెల్లించి, అక్రమ బదిలీలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు టి.రమేష్, జిల్లా కార్యదర్శులు కె.మురళి, ఎన్.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నల్ల బెలూన్లతో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

రాష్ట్ర విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణ చేతుల మీదుగా రాష్ట్రస్థాయి ఉత్తము ఉపాధ్యాయ అవార్డులు అందుకుంటున్న తిరుపతి, రాంబాబు, ప్రిన్సిపల్ మంజులవీణ

రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

జియమ్మ వలస మండలం రావాడ రామభద్రపురం గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తున్న ఎన్.తిరుపతి విశాఖపట్నంలో విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చేతులు మీదుగా రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డు, రూ.20వేలు నగదు బహుమతి అందుకున్నారు. మరోవైపు ఇదే పాఠశాలలో డ్రాయింగ్ టీచర్‌గా పని చేస్తున్న రుగడ శ్రీనివాసరావు కలెక్టర్ నిశాంత్ కుమార్ చేతుల మీదుగా జిల్లా స్థాయి అవార్డు అందుకున్నారు. ఒకే పాఠశాల నుంచి ఇద్దరు ఉపాధ్యాయులకు ఉత్తమ అవార్డులు రావడం పట్ల ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

వీరఘట్టం : మండలంలోని చిట్టిపూడివలస మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయునిగా విధులు నిర్వహిస్తున్న సాకేటి రాంబాబుకు రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపిక కావడంతో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చేతుల మీదుగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయునిగా అవార్డు అందుకున్నారు. దుస్సాలులతో ఘనంగా సన్మానించి గోల్డ్ మెడలతో మెమెంటు, సర్టిఫికెట్ అందజేశారు.

రాష్ట్రస్థాయి ఉత్తమ ప్రిన్సిపల్ గా మంజులవీణ

సాలూరు: జిల్లా డివిఇఒ, మక్కువ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ మంజులవీణ రాష్ట్ర స్థాయి ఉత్తమ ప్రిన్సిల్‌గా అవార్డు అందుకున్నారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చేతులు మీదుగా ఆమె అవార్డు అందుకున్నారు. ఆమెకు అవార్డు రావడం పట్ల పలువురు ఉపాధ్యాయులు, అధ్యాపకులు హర్షం వ్యక్తంచేశారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయునిగా కెవి సత్యనారాయణ

జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయునిగా పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు కెవి సత్యనారాయణ అవార్డు అందుకున్నారు. సత్యనారాయణకు జిల్లా అవార్డు లభించడం పై ఎపిటిఎఫ్ మండల,పట్టణ నాయకులు,ఉపాధ్యాయులు హర్షం వ్యక్తంచేశారు.

11న జిల్లా స్థాయి యువజనోత్సవాలు

ప్రజాశక్తి - పార్వతీపురం

రాష్ట్ర యువజన సర్వీసుల శాఖ కమిషనర్, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా స్థాయి యువజనోత్సవాలు ఈనెల 11న జట్టు ఆశ్రమములో నిర్వహించనున్నట్టు సెట్విజ్ సిఇఒ బి.రామగోపాల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ యువజనోత్సవాల్లో భాగంగా సాంస్కృతిక విభాగంలో జానపద నృత్యాలు (సోలో, బృందం), జానపద గీతాలు (సోలో, బృందం), జీవిత నైపుణ్య విభాగంలో స్టోరీ రైటింగ్ (సోలో), పోస్టర్ మేకింగ్ (సోలో), డిక్లమేషన్ (సోలో), ఫోటోగ్రఫీ (సోలో), వన్ మినిట్ - పర్యావరణ పరిరక్షణపై (సోలో), ఆరోగ్యము, శరీర ధృడత్వం విభాగంలో యోగా ప్రదర్శన (బృందం)పై పోటీలు నిర్వహించనున్నట్టు తెలిపారు. 15-29 ఏళ్ల మధ్య వయస్సున్న యువతీయువకులు పోటీల్లో పాల్గొనవచ్చునని తెలిపారు. జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన వారు రాష్ట్రస్థాయి, రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన వారు జాతీయస్థాయి యువజనోత్సవాల్లో పాల్గొనవచ్చునని తెలిపారు. ఈ ఉత్సవాల్లో పాల్గొనదలచిన వారు ముఖ్యకార్యనిర్వహణాధికారి, సెట్విజ్, కంటోన్మెంట్, విజయనగరం కార్యాలయము నకు నేరుగా గాని, setviz@yahoo.com మెయిల్ కు లేదా వాట్సాప్ ఫోన్ నంబర్స్ 9849913080, 8247554334 లకు ఈనెల 10వ తేది సాయంత్రం 5.00 గంటల లోపు దరఖాస్తు పంపాల్సిందిగా కోరారు. దరఖాస్తులు అన్ని ఎంపిడిఒ కార్యాలయాల్లో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. https://forms.gle/jkwMWAZAYNMnfaow8 లింక్ ద్వారా పోటీలో పాల్గొనే అభ్యర్థులు పేర్లు, ఇతర వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. పోటీలను సందర్శించేందుకు అందరూ ఆహ్వానితులే అని, ఇతర సందేహాలు, వివరాలకు 9849913080, 8247554334 నంబర్స్ ను సంప్రదించవచ్చునని తెలిపారు.

తొలగించిన ఓట్లు కలెక్టర్ పరిశీలన

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని దుగ్గేరులో తొలగించిన ఓట్లను కలెక్టర్ నిశాంత్ కుమార్ మంగళవారం పరిశీలించారు. దుగ్గేరులో పది ఓట్లు తొలగించినట్లు కుటుంబాలకు సభ్యులకు తెలిపారు. మరణించినట్లు కుటుంబ సభ్యులు ధ్రువీకరించడంతో వారికి మరణ ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలని తహశీల్దార్‌ను ఆదేశించారు. ఓటరు తొలగింపు ప్రక్రియ పక్కాగా ఎన్నికల నిబంధనల మేరకు ఉండాలని ఆదేశించారు. తొలగిస్తున్న ప్రతి ఓటును నిశితంగా పరిశీలించాలన్నారు. ఓట్ల తొలగింపుపై కుటుంబ సభ్యులకు తెలియజేయాలన్నారు. మృతి చెందిన, శాశ్వత వలసలు వెళ్ళిన, డూప్లికేట్ ఓటర్లను గుర్తించామని, వాటిని తొలగిస్తున్నట్టు తెలిపారు. కలెక్టర్ వెంట తహశీల్దార్ ఎ.సూర్యనారాయణ, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఒక ఇంటి ఓటర్లు ఒక పోలింగ్ బూత్ లోనే

సాలూరు : ఒక ఇంటి ఓటర్లు ఒక పోలింగ్ బూత్‌లోనే ఉండేలా చర్యలు చేపట్టామని ఐటిడిఎ పిఒ, సాలూరు నియోజకవర్గం ఓటరు నమోదు అధికారి సి.విష్ణు చరణ్ తెలిపారు. ఓటరు జాబితా విచారణలో భాగంగా మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజకీయ పార్టీల ప్రతినిధులు ఒక ఇంటిలో ఓట్లు సైతం వివిధ పోలింగ్ కేంద్రాల్లో ఉంటున్నాయని, వాటిని పరిశీలించి చర్యలు చేపట్టాలని కోరారు. దీనిపై ఓటరు నమోదు అధికారి విష్ణుచరణ్ స్పందిస్తూ ఒక పోలింగ్ కేంద్రంలో 1500 ఓట్లకు మాత్రమే ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఒక ఇంటి ఓటర్లు, అవకాశం మేరకు ఒక వీధి ఓటర్లు అంతా ఒక పోలింగ్ బూత్ లోనే ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఇటీవల చేపట్టిన ఓటరు విచారణలో భాగంగా ఫారం 6, 7,8 తీసుకున్నామన్నారు. ఫారం 6 కింద 2510 దరఖాస్తులు, ఫారం 7 కింద 1979 దరఖాస్తులు, ఫారం 8 క్రింద 13205 దరఖాస్తులు అందాయని వివరించారు. సమావేశంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు ఎ.పరమేష్, పిన్నింటి ప్రసాద్ బాబు, ఎం.శ్యాం, జిల్లా అధికార ప్రతినిధి అక్కేన తిరుపతిరావు, గిరిజన నాయకులు మాలతీదొర, సిపిఎం నాయకులు ఎన్వైనాయుడు, ఎం.శ్రీనివాసరావు, సిపిఐ జిల్లా నాయకులు ఎస్.రామచంద్రరావు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సిగడాపు బంగారయ్య, తహశీల్దార్ బాలమురళీకష్ణ పాల్గొన్నారు.

అటవీరేంజ్ అధికారికి సమస్యను వివరిస్తున్న అఖిలపక్ష నాయకులు

తక్షణమే ఏనుగులను తరలించాలి

ప్రజాశక్తి - బెలగాం

ఏనుగుల బాధలు ఇంకెన్నాళ్లని, తక్షణమే ఏనుగుల తరలింపునకు చర్యలు తీసుకోవాలని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక జిల్లా అటవీశాఖాధికారి కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ సోమవారం కొమరాడ మండలం అర్తాం వద్ద ఏనుగు బస్సుపై చేసిన దాడిలో జరగకూడని ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. ఇప్పటివరకు 11 మంది ప్రజల ప్రాణాలను పొట్టన పెట్టుకొని, 35 మూగ జీవాలను చంపేశాయన్నారు. దాదాపు రూ.3కోట్లు కోట్ల ఆస్తి నష్టం జరిగిందన్నారు. గత నాలుగైదు ఏళ్లుగా కురుపాం, పార్వతీపురం, పాలకొండ తదితర నియోజకవర్గాల ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న ఏనుగుల సమస్య పరిష్కారానికి ప్రభుత్వ నిర్ణయం ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. ఏనుగుల సమస్యల పరిష్కారంలో పాలకులకు, అధికారులకు కనీసం చిత్తశుద్ధి లేదన్నారు. ఇంకా ఎన్నాళ్ళు ఎంత మందిని చంపే వరకు చూస్తారన్నారు. తక్షణమే ఏనుగుల తరలింపుకు తదితరులు చేపట్టాలన్నారు. అలాగే బాధితులకు నష్టపరిహారం కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం అటవీశాఖ రేంజ్ అధికారి కె.మణికంఠష్‌కు వినతిని అందజేశారు. దీనికి ఆయన స్పందిస్తూ ఏనుగులను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు స్థలం కోసం అన్వేషిస్తున్నట్లు తెలిపారు. ఏనుగుల సమస్యకు శాశ్వత పరిష్కారం చేపట్టని పక్షంలో అఖిలపక్షం ఆధ్వర్యంలో పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం, సిఐటియు, ఐద్వా, పట్టణ పౌర సంక్షేమ సంఘ నాయకులు వి.ఇందిర, రెడ్డి శ్రీదేవి, గొర్లి వెంకటరమణ, పాకల సన్యాసిరావు, బంకురు సూరిబాబు, సంచాన ఉమామహేశ్వరరావు, జనసేన నాయకులు వంగల దాలి నాయుడు, అన్నాబత్తుల దుర్గాప్రసాద్, కర్రి మణికంత, తామరకండి తేజ, గుంట్రెడ్డి గౌరీ శంకర్, అంబటి బలరాం, తిరుమలరెడ్డి కనకరాజు, అయ్యర్ల సంఘ నాయకులు పి.సంగం, బిజెపి నాయకులు సొండి సంజీవి, పళ్లెం కనకారావు, రొంపిల్లి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తం

ప్రజాశక్తి - కురుపాం

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగాఉండాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బి.జగన్నాధరావు అన్నారు. మండలంలోని మొండెంఖల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఆశా కార్యకర్తల సమావేశం జరుగుతున్న నేపథ్యంలో అక్కడ పాల్గొని ప్రతి ఆశ కార్యకర్త దగ్గర గర్భ నిర్ధారణ పరీక్ష కిట్లు ఉన్నందున ఐరిస్క్ గర్భిణీలను తొందరగా గుర్తించి వైద్యాధికారికి తెలియజేస్తే సరైన వైద్యం అందించవచ్చని అన్నారు. వీరికి ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవం సురక్షితమన్నారు. అలాగే మలేరియా, డెంగ్యూ సీజనల్ వ్యాధుల పట్ల ఆశ యాప్, మిషన్ ఇంద్రధనస్సు యాపిల్ లో అప్లోడ్ సక్రమంగా చేయాలని సూచించారు. అనంతరం వైద్య సిబ్బందితో మాట్లాడుతూ పిహెచ్‌సిలో జరిగే అబార్షన్లు, ఐయుడి, స్టిల్ బర్త్ రికార్డులు సచివాలయం వారీగా ఉంచి ప్రతి నెలా వాటిపై మీద ప్రత్యేక దృష్టి పెట్టి సమీక్షించాలని, గర్భిణీలు, రక్తహీనతతో బాధపడుతున్న అందరికీ అవసరమైన మందులు తప్పని సరిగా అందించాలని సూచించారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం రోజున గర్భిణులు, రక్తపోటు, షుగర్ వ్యాధులతో బాధపడే వారికి వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే మొండెంఖల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రసవాలు ప్రతినెలా ఎక్కువ జరగడంతో వైద్యాధికారిని, సిబ్బందిని అభినందించారు. ఆసుపత్రిలో గల రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మొండెంఖల్ పిహెచ్‌సి వైద్యాధికారి బి.ప్రజ్ఞ, సిబ్బంది శ్రీధర్, భారతి, నాగేశ్వరరావు, విజయ్, ఆరోగ్య సహాయకులు జె.తిరుపతి పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో వైద్య సేవలు సక్రమంగా అందించాలని వైద్య సిబ్బందికి, ఆశా వర్కర్లకు, సిహెచ్‌డబ్ల్యూలకు వైద్యాధికారి డాక్టర్ ఎం.వెంకట ప్రదీప్ కుమార్ సూచించారు. ఆశా డే కార్యక్రమంలో భాగంగా రావాడ రాంభద్రపురం పిహెచ్‌సిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో జ్వరాలు, విరోచనాలు మొదలైన వ్యాధులు వచ్చిన వెంటనే వైద్య సేవలందించి వైద్యాధికారికి తెలిపాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిహెచ్‌ఇఒ సూర్యనారాయణ, ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్‌ఎంలు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, సిహెచ్‌డబ్ల్యూలు పాల్గొన్నారు.

వీరఘట్టం:గ్రామాల్లోని గర్భిణీలను గుర్తించి వారికి సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేసేలా చూడాలని స్థానిక వైద్యాధికారి జి ప్రదీప్ కుమార్ ఆశా కార్యకర్తలను ఆదేశించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. తరచూ గ్రామాల్లో ఉండి ప్రజల ఆరోగ్య స్థితిగతులు తెలుసుకొని సమాచారం ఇవ్వాలన్నారు. జ్వరాలు తమ దృష్టికి తీసుకువస్తే అక్కడ వైద్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో మల్టీ పర్పస్ వెల్త్ ఇఒ జనార్ధనరావు, సూపర్వైజర్ శాంత కుమారి, ఎఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కురుపాం : ఆశాలతో మాట్లాడుతున్న డిఎంహెచ్‌ఒ జగన్నాధరావు

సీజనల్ వ్యాధులు, హై రిస్క్ గర్భిణులపై శ్రద్ధ వహించాలి

భామిని : సీజనల్ వ్యాధులపైనా, హైరిస్క్ గర్భిణులపై వైద్యసిబ్బంది శ్రద్ధవహించాలని జిల్లా ఇమ్యునిజేషన్ అధికారి డాక్టర్ టి.జగన్ మోహన్‌రావు సూచించారు. మంగళవారం స్థానిక పిహెచ్‌సిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రజలకు అందుతున్న సేవలపై ఒపికి వచ్చిన రోగులతో మాట్లాడి తెలుసుకున్నారు. వైద్యాధికారి డాక్టర్ ఫణికుమార్ అధ్వర్యంలో జరుగుతున్న ఆశ డే కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ నెల11 నుంచి 16 వరకు నిర్వహిస్తున్న ఇంటేన్సిఫైడ్ మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమంలో డ్రాప్ ఔట్, లెఫ్ట్ ఔట్ పిల్లలను గుర్తించి అందరికీ టీకాలు వేయాలని తెలిపారు. ఆశా కార్యకర్తల సమావేశంలో సీజనల్ వ్యాధులపై, హై రిస్క్ గర్భిణులు కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఒ భాస్కర్ రావు, హెచ్‌వి గౌరీశ్వరి, ఇమ్యునిజేషణ్ సూపర్వైజర్ జయ కుమార్, ఎఎన్‌ఎం, ఎంఎల్‌పిహెచ్, ఆశా, హెల్త్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

వైసిపి హయాంలోనే గిరిజనాభివృద్ధి : డిప్యూటీ సిఎం

ప్రజాశక్తి -మక్కువ

మండలంలోని దబ్బగెడ్డ పంచాయతీ పరిధిలో నగుళ్ల దబ్బగెడ్డలో గడప గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమంలో గిరిజన శాఖా మంత్రి పీడిక రాజన్నదొర మాట్లాడుతూ గిరిజన అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేసిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. రానున్న ఎన్నికల్లో మళ్లీ జగన్మోహన్‌రెడ్డిను ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు ప్రతిపక్షాలు పసలేని విమర్శలు చేస్తూ అభాసపాలవుతున్నాయని విమర్శించారు. కార్యక్రమంలో ఎంపిపి మర్రి పారమ్మ, జెడ్పీటీసీ సభ్యులు మావుడి శ్రీనివాసనాయుడు, వైసీపీ మండల అధ్యక్షులు మావుడి రంగునాయుడు, స్థానిక సర్పంచ్ సీదరపు లక్ష్మి, ఎంపిడిఒ సూర్యనారాయణ, వివిధ పంచాయతీల సర్పంచులు, ఎంపిటిసిలు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు

8న రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు రాక

ప్రజాశక్తి - పార్వతీపురం

రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు బి.కాంతా రావు ఈ నెల 8న జిల్లాలో పర్యటనకు వస్తున్నారని జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 8న ఉదయం 10.30 గంటలకు పార్వతీపురం వస్తారని, జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సంబంధిత అధికారులతో సమావేశం అనంతరం క్షేత్ర స్థాయిలో పర్యటన ఉంటుందని ఆయన తెలిపారు.

మాజీ సైనికుల పిల్లలకు ఉపకార వేతనాలు

ప్రజాశక్తి - పార్వతీపురం

మాజీ సైనికుల పిల్లలకు పిఎం ఉపకార వేతన పథకం అందిస్తున్నట్లు జిల్లా సైనిక సంక్షేమాధికారి మజ్జి కృష్ణారావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2023-24 సంవత్సారానికి గాను బిఇ, బిటెక్, ఎంబిబిఎస్, బిడిఎస్, బిబిఎ, బిసిఎ, బి ఫార్మసీ, బీఎస్సీ, (నర్సింగ్) ఎల్ఎల్‌బీ, ఎంబిఎ, ఎంసిఎ తదితర వృత్తివిద్యా కోర్సుల్లో మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఉపకార వేతనాలు పొందొచ్చన్నారు. ఈ మేరకు కేంద్రీయ సైనిక్ బోర్డ్ న్యూఢిల్లీ , డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. కేఎస్‌బీ.జీవోవీ.ఇన్ వెబ్ సైట్‌లో నవంబర్ 30లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పైన పేర్కొన్న కోర్సుల్లో కనీసం 60శాతం మార్కులు వస్తేనే ఉపకార వేతనం పొందే అవకాశం ఉందని తెలిపారు.

విద్యార్థుల నుంచి సమాధానాలు రాబడుతున్న పిఒ కల్పనాకుమారి

పాఠశాలను పిఒ పరిశీలన

ప్రజాశక్తి - భామిని

మండలంలోని నల్లరాయిగూడ జిపిఎస్ పాఠశాలను ఐటిడిఎ పిఒ కల్పనా కుమారి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. పాఠశాల ఆవరణ బాగుందన్నారు. అనంతరం 136 పోలింగ్ స్టేషన్‌ను పరిశీలించారు. ఇంకా ఏమైనా మార్పులు చేర్పులుంటే వెంటనే చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది ఉన్నారు.

తేలికపాటి వర్షాలు

ప్రజాశక్తి - కురుపాం

రానున్న ఐదు రోజుల్లో ఉమ్మడి జిల్లాలో తేలిక పాటి వర్షాలు కురుస్తాయని కెవికె వాతావరణ విభాగ శాస్త్రవేత్త కె. ప్రశాంత్ తెలిపారు. మంగళవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ రానున్న 5రోజులు గరిష్ట ఉష్ణోగ్రతలు 34డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 26-27డిగ్రీలు, గాలిలో తేమశాతం 74-80శాతం ఉండవచ్చన్నారు. ఈనెల 6, 7 తేదీల్లో 10.0 మిల్లీమీటర్లు, 8న 12మిల్లీమీటర్లు, 9,10 తేదీల్లో 6మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందన్నారు.

హెడ్ కానిస్టేబుల్ కృష్ణమూర్తికి సన్మానం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణ పోలీస్ స్టేషన్లో హెడ్ కానిస్టేబుల్‌గా వృద్ధ మిత్ర కోఆర్డినేటర్‌గా పనిచేస్తున్న కె.కృష్ణమూర్తి చేస్తున్న సేవలు వెలకట్టలేనివని పట్టణ యాదవ సంఘం సభ్యులు అన్నారు. గురుపూజోత్సవం సందర్భంగా మంగళవారం ఆయనకు పుష్పగుచ్చాలు అందజేసి దుస్సాలువతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కృష్ణమూర్తి వంటి సేవాతత్పరులు మన పార్వతీపురంలో ఉండడం ఎంతో గర్వకారణంగా ఉందన్నారు. ప్రతినెలా కృష్ణమూర్తి తన వేతనంలో కొంత మొత్తాన్ని పేదలకు కేటాయించడం అభినందించదగ్గ విషయమన్నారు. కృష్ణమూర్తిని ఆదర్శంగా తీసుకుని పేదలను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో యాదవ సంఘం అధ్యక్షులు బత్తుల రమేష్, నాయకులు బత్తుల శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, మాజీ ఆర్మీ ఉద్యోగి దుర్గాప్రసాద్, రామారావు, ఈశ్వరరావు, గోవిందరావు, 30వ వార్డు కౌన్సిలర్ రణభేరి చిన్నమనాయుడు, పి.పోలినాయుడు, పులిబాబు, వి. గంగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి బకాయి బిల్లులు చెల్లించాలి

ప్రజాశక్తి - సాలూరురూరల్

ఉపాధి హామీ చట్టం కింద పనులు చేసి వేతనదారులకు పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంగళ వారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయ అధికారులకు వేతనదారులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టంలో ప్రతి వేతనదారునికి ఏడాదికి 200 రోజులు పని కల్పించి ప్రతి ఒక్కరికీ రోజుకు రూ.600 కూలీ చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పనులు చేసి నెలల గడుస్తున్న బకాయి బిల్లులు చెల్లించలేదని తెలిపారు ఉపాధి హామీలో ప్రభుత్వం మంజూరు చేసిన గృహ బిల్లులు చెల్లించక నిర్మాణాలు ఆగిపోయే పరిస్థితి వచ్చిందన్నారు. ఉపాధి హామీ చట్టం నుండి ప్రతి గృహ లబ్దిదారునికి రూ.27వేలు చెల్లించాల్సి ఉన్నా, ఇప్పటికీ చెల్లించలేదని అన్నారు. ఇప్పటికైన వారికి చెల్లింపులు చేయాలని కోరారు. వ్యవసాయ రంగంలో వ్యవసాయ కూలీలకు పని దినాలు తగ్గిపోయాయని, పనులు దొరకక బయట ప్రాంతాలకు వలసలు పోతున్నారని తెలిపారు. కావున ప్రభుత్వం స్పందించి ఉపాధి పనులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు, మండల నాయకులు మెల్లిక కోమన్న, వేతనదారులు పాల్గొన్నారు.

భవిష్యత్తుకు గ్యారంటీపై అవగాహన కల్పిస్తున్న జయకృష్ణ

గిరిజన గ్రామాల్లో భవిష్యత్తుకు గ్యారెంటీ

ప్రజాశక్తి - సీతంపేట

పాలకొండ నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ ఆధ్వర్యంలో బాబు ష్యూర్టీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం మండలంలోని కెజవీరఘట్టం, పుబ్బడ పంచాయతీ పరిధిలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జయకృష్ణ మాట్లాడుతూ రాబోయేది టిడిపి ప్రభుత్వమని, పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే పేదలను సంపన్నులుగా చేసే బాధ్యత బాబు తీసుకుంటారని అన్నారు. కావున ప్రతి ఒక్కరూ చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రి చేయాలని పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల్లో చంద్రబాబు నాయుడ్ని ముఖ్యమంత్రిని చేయడమే మన లక్ష్యమని పార్టీ క్యాడర్ కు దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ ప్రధాన కార్యదర్శి బిడ్డిక అప్పారావు, యూనిట్ ఇంచార్జ్ బిడ్డిక స్వామినాయుడు, నాయకులు మండంగి ప్రకాశం, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కురుపాం : మండలంలో జి. శివడ పంచాయతీలో గల పెద్ద అంటి జోల, దిగువ అంటిజోల గిరిజన గ్రామాల్లో మండల కన్వీనర్ కె.వి. కొండయ్య ఆధ్వర్యంలో బాబు షఉరిటీ భవిష్యత్ గ్యారంటీ అనే కార్యక్రమం జరిగింది . ఈ కార్యక్రమానికి టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి టి. జగదీశ్వరి పాల్గొన్నారు.

ప్రకృతి వనరుల కేంద్రాలు ఏర్పాటు

ప్రజాశక్తి - సాలూరురూరల్

ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు అందుబాటులో అన్ని గ్రామాల్లో ప్రకృతి వనరుల కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రకృతి వ్యవసాయ రీజనల్ టెక్నికల్ లీడ్ ఆఫీసర్ ప్రకాశ్ తెలిపారు. ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు సేద్య కషాయాలను తయారీ చేసి రైతులకు అందించేందుకు కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. ఈమేరకు మంగళవారం మామిడిపల్లిలో ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు కాంపౌండ్ బ్లాక్‌లను పరిశీలించిన ఆయన సిబ్బందితో మాట్లాడుతూ ప్రకతి వ్యవసాయలో జీవామతం, దశ పత్ర కషాయం ,బ్రహ్మాస్త్రం, అగ్నస్త్రం మొదలగు కశాయాలను రైతులతో స్ప్రేయింగ్ చేయించాలని తెలిపారు. చీడ, పీడల నివారణకు కషాయాలతో పాటు పసుపు పల్లాలు ,లింగాకర్ష బట్టలు,పక్షి స్థావరాలు, గట్ల పైన కూరగాయ విత్తనాలు అదనపు ఆదాయం కోసం ఎర పంటలు, అంతర పంటలు వేసుకోవడానికి రైతులకు తగు సూచనలు సిబ్బంది ఇవ్వాలని తెలిపారు. అనంతరం ప్రకతి వ్యవసాయ పద్ధతులతో సాగు చేస్తున్న వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రకతి వ్యవసాయ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

108 పైలెట్‌కు ఆర్థిక సాయం

కురుపాం : 108 వాహనంలో విధులు నిర్వహిస్తూ అస్వస్థతకు గురై అనారోగ్యంతో బాధపడుతూ విజయనగరం తిరుమల ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న 108 వాహన పైలట్ బంకుర తవిటినాయడుకు ఉమ్మడి జిల్లాల 108 సిబ్బంది ఆర్థికసాయం అందించారు. ప్రతి ఉద్యోగి నుంచి సేకరించిన రూ.70,300ను మంగళవారం ఆయనకు అందజేశారు. కార్యక్రమంలో 108 ఉద్యోగుల జిల్లా అధ్యక్షుడు గొర్లి అప్పలనాయుడు, ప్రధాన కార్యదర్శి తెర్లి వెంకటరమణ, విజయనగరం జిల్లా అధ్యక్షులు వేమల అప్పలనాయుడు, వర్కింగ్ ప్రెసిడెంట్ కొల్లు గోపాలం, ఇరు జిల్లాలకు చెందిన 108 సిబ్బంది పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య..

ప్రజాశక్తి - కురుపాం

కురుపాం పంచాయతీ పూతికవలసలో ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై ప్రసాద్ అందించిన వివరాలు ప్రకారం పూతికవలసకు చెందిన మండంగి దుర్గాప్రసాద్ భార్య సంధ్యారాణి (24) మంగళవారం తన ఇంట్లో ఉరి వేసుకొని మృతి చెందినట్లు తెలిపారు. ఈమెకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. సంధ్యారాణి స్వగ్రామం శ్రీకాకుళం. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా జిల్లాలోని పలు విద్యా సంస్థల్లో ఉపాధ్యాయ దినోత్సవాలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. పలువురు ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు.

పార్వతీపురం టౌన్ : సమాజానికి మార్గదర్శకులు ఉపాధ్యాయులేనని వాకర్స్ క్లబ్ ఏరియా వైస్ ప్రెసిడెంట్, మున్సిపల్ వైస్‌చైర్మన్ జంధ్యాలపు గున్నేష్ అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో డిఇఒ ప్రేమ్ కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొనగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన రాజు, నాని ఉపాధ్యాయులు, వాకర్స్ క్లబ్ సభ్యులైన వనజాక్షి మేడం, సూర్యనారాయణ ఉపాధ్యాయులతో పాటు 13 మంది ఉపాధ్యాయులకు క్లబ్ సభ్యులు పుష్ప గుచ్చాలను అందించి దుశ్శాలువలతో సత్కరించి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ సభ్యులు వాకర్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్, ఎంఇఒ నారాయణస్వామి, డి.వెంకటనాయుడు మాస్టారు, డివి రమణ మాస్టారు, ఆర్ఎస్ నాయుడు మాస్టారు, వెంకటేశ్వరరావు, వాకర్స్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు. **బలిజిపేట :** మండలంలోని పెదపెంకిలో నేతాజీ గ్రంథాలయం వద్ద గ్రంథాలయ స్థాపకులు ఈర్ల సంజీవనాయుడు ఆధ్వర్యంలో మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా సర్వేపల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో గంట సాధు, ఆర్మీ ఉద్యోగి జి.సింహచలం, హైస్కూల్ విద్యా కమిటీ చైర్మను బౌరోతు పోలినాయుడు, బొద్దాన వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. శ్రీ భారతి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో పిల్లలు, ముందుగా సర్వేపల్లి రాధాకష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు అనంతరం ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం బి.జగన్, ఎస్సై యన్ ప్రశాంత్ కుమార్ మాట్లాడారు. అనంతరం విద్యార్థులు వివిధ వేషధారణలో కనిపించే విద్యార్థులు తల్లిదండ్రులను ఉపాధ్యాయులను ఆకర్షించుకున్నారు. అనంతరం బుధవారం కష్ణాష్టమి సందర్భంగా పాఠశాలలో ఉట్టె కొట్టి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఎంఇఒ సామల సింహాచలంను ఎంటిఎస్ జిల్లా నాయకులు బోనంగి తమ్మినాయుడు, మండల విద్యాశాఖ కార్యాలయ సిబ్బంది ఘనంగా సత్కరించారు. **సీతంపేట :** వృత్తుల కన్నా ఉపాధ్యాయ వృత్తి గొప్పదని సర్పంచ్ హెచ్.ఆదిలక్ష్మి అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా పెద్దూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులు నెల్లి సత్యం నాయుడు మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును తరగతి గదిలో తీర్చిదిద్దే ది ఒక ఉపాధ్యాయుడు మాత్రమే అన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎస్.ప్రసాదు, విద్యా కమిటీ చైర్మన్ కళావతి, తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో గురు పూజోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు, ఉప విద్యాశాఖ అధికారి ఎ.లిల్లీరాణి సర్వేపల్లి రాధాకష్ణ విగ్రహానికి పూలమాల వేశారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల కళాశాలలో: ప్రిన్సిపల్ శ్యాంబాబు ఆధ్వర్యాన ఉపాధ్యాయ దినోత్సవం జరిగింది. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని ధోను బాయి బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు కొండ గొర్రె సుబ్బారావుకు ఉత్తమ హెచ్ఎంగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయన పార్వతీపురంలో కలెక్టర్ నిశాంత్ కుమార్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకున్నారు. అలాగే ధోనుభాయి ఆశ్రమ పాఠశాలలో ఉపాధ్యాయుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. **గుమ్మలక్ష్మీపురం :**ఉపాధ్యాయ దినోత్సవం మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. గుమ్మలక్ష్మీపురం, ఎల్విన్ పేట, మండ, పి ఆమిటి, టిక్కబాయి, తాడికొండ, కేదారి పురం, దుడ్డు ఖల్లు, రేగిడి గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక, ఎంపిపి, ఎయిడెడ్, గిరిజన గురుకుల, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను కన్నుల పండుగ నిర్వహించారు. విద్యార్థుల వేషధారణ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని జర్న ఎంపిపి పాఠశాలలో హెచ్ఎంగా పనిచేస్తున్న మేడిద గోవిందరావుకు టీచర్స్ డే సందర్భంగా పార్వతీపురం వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో డిఇఒ ప్రేమ్ కుమార్ చేతుల మీదుగా సన్మానించారు. జియమ్మ వలస మండలం పెదమేరంగి తిరుమల సాయి హైస్కూల్‌లో ఉపాధ్యాయ బృందానికి' 'గురువుకి వందనం ' అనే సామూహిక కార్యక్రమం నిర్వహించారు. చిన మేరంగి, బిజెపురం, పెద్ద బుడ్డిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో టీచర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. **కురుపాం :** స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు సర్వేపల్లి రాధాకష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసే నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ వృత్తికి ఆయన చేసినటువంటి సేవలను గుర్తు తెచ్చుకున్నరు. ఈ కార్యక్రమంలో పాఠశాలలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **వీరఘట్టం** :స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో సర్వేపల్లి రాధాకష్ణ చిత్రపటానికి పూలమాలవేసి, ప్రధానోపాధ్యాయులు ఎస్ సుంభరోకు ఉపాధ్యాయ సిబ్బంది దుశాల్వాతో ఘనంగా సన్మానించారు. కంబర వలస మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు సర్వేపల్లి రాధాకష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. **పాలకొండ రూరల్:** స్థానిక రవీంద్రభారతి పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా సర్వేపల్లి రాధాకష్ణ చిత్రపటానికి పాఠశాలల చైర్మన్ యం.యస్.మణి పూలమాలలు సమర్పించి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. గత పదేళ్ళుగా విధులు నిర్వహిస్తూ, ప్రతిభావంతులైన విద్యార్థులను తయారు చేస్తున్న ఉపాధ్యాయులను ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులతో పాటు ప్రశంసా పత్రాలతో సత్కరించారు. కార్యక్రమంలో రవీంద్ర భారతి పాఠశాలల ఉత్తరాంధ్ర జోనల్ ఇన్చార్జ్ ఎన్.వెంకటేష్, పాఠశాల ప్రిన్సిపాల్ టి.సుబ్రమణ్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. **భామిని :** జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని స్థానిక మండలం వనరులు కేంద్రంలో ఎంఇఒలు శ్రీనివాసరావు, భాస్కరరావు ఆధ్వర్యంలో మండలంలో ఉపాధ్యాయులుగా విధులు నిర్వహించి, రిటైర్ అయిన 9 మందిని శాలువా తో సత్కరించి, పుష్ప గుచ్చాలు అందజేశారు. కార్యక్రమం మండలం లోని వివిధ పాఠశాల ఉపాధ్యాయులు, స్థానిక రిసోర్స్ సెంటర్ సిబ్బంది రామకష్ణ, సురేష్ వున్నారు. **సీతానగరం:** మండలంలోని పనిచేస్తున్న రుత్తల ఉమా మహేశ్వరరావు(నిడగల్లు-1), కాతా కల్యాణి (ఇప్పలవలస) ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికై కలెక్టర్ నిశాంత్ కుమార్ చేతులమీదుగా అవార్డులు తీసుకున్నారు. వీరిని ఎంఇఒలు సూరిదేముడు, వెంకటరమణ, నిడగల్లు ఉన్నతపాఠశాల హెచ్ఎం శివున్నాయుడు, ఆయాపాఠశాలల సిబ్బంది, తల్లిదండ్రులు , విద్యార్థులతో పాటు మండలంలోని అన్ని ఉపాధ్యాయ సంఘాల నాయకులు అభినందనలు తెలిపారు. **గరుగుబిల్లి:** స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్న ఎస్ఎల్ పాత్రుడు గురుపూజోత్సవం సందర్భంగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్న ఆయన్ను పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ కలిశెట్టి.నర్సింగరావుతోపాటు, ఉపాధ్యాయులు కల్లూరి రవీంద్ర, భాస్కరరావు, రాము, లిల్లీ, రమణి, అనిత, తదితరులు శాలువకప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు కల్లూరి రవీంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

పార్వతీపురం: ఉపాధ్యాయులను సన్మానిస్తున్నడిఇఒ ప్రేమ్‌కుమార్

తెలుగు తేజోమూర్తులకు ఘన సన్మానం

పాలకొండ:స్థానిక శాఖా గ్రంథాలయంలో పాలకొండ సేవా కిరణ్ సంస్థ అధ్యక్షులు చింతా భాస్కర నాయుడు ఆధ్వర్యంలో తెలుగు భాషా పరిరక్షణకు కృషి చేస్తున్న తెలుగు తేజోమూర్తులకు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులు కె. జనార్ధన రావు, ఆదర్శ ఉపాధ్యాయులు ,రచయిత శ్రీ టి. సూర్య నారాయణకు సేవా కిరణ్ సభ్యులు గోవిందరావు, అనంతాచారి ,శంకరరావు,మరియు స్థానిక ఇంఛార్జి గ్రంథాలయ అధికారి బబ్బురు గణేష్ బాబు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠకులు, వివేకానంద స్కూల్ విద్యార్థులు, సహాయకుడు ఈశ్వర్ పాల్గొన్నారు.

సీతంపేట : దాధాకృష్ణన్‌కు నివాళ్లు అర్పిస్తున్న ఉపాధ్యాయులు

బలిజిపేట : దాధాకృష్ణన్‌కు నివాళ్లు అర్పిస్తున్న గ్రామస్తులు

1.87లక్షల ఓట్లపై విచారణ

ప్రజాశక్తి - పార్వతీపురం

నియోజకవర్గంలో 187751 ఓట్లు విచారణ చేయడం జరిగిందని రెవిన్యూ డివిజనల్ అధికారి, పార్వతీపురం నియోజక వర్గం ఓటరు నమోదు అధికారి కె.హేమలత అన్నారు. ఓటరు పునశ్చరణపై మంగళవారం పార్వతీపురం నియోజకవర్గం స్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో 187815 ఓట్లు ఉన్నాయన్నారు. సీతానగరం మండలం నిడగల్లులో మృతి చెందిన ఓటర్లు సైతం జాబితాలో ఉన్నాయని ప్రతినిధులు తెలిపారు. తక్షణం సందర్శించి చర్యలు తీసుకుంటామని ఆమె పేర్కొన్నారు. సమావేశం అనంతరం నిడగల్లులో సందర్శించి పరిశీలించారు. నియోజకవర్గంలో గత వారం రోజులలో ఫారం 6 కింద 149, ఫారం 7 క్రింద 149, ఫారం 8 కింద 125 దరఖాస్తులు అందాయని తెలిపారు. తొలగిస్తున్న ప్రతి ఓటును నిశితంగా పరిశీస్తుందని చెప్పారు. సమావేశంలో తహశీల్దార్లు, రాజకీయ ప్రతినిధులు పాల్గొన్నారు.

అసత్య ఆరోపణలు చేస్తే క్రిమినల్ కేసులు : ఎంపిపి

ప్రజాశక్తి - పాచిపెంట

ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొరపై అసత్య ఆరోపణలు చేస్తే క్రిమినల్ కేసులు తప్పవని ఎంపిపి బి.ప్రమీల హెచ్చరించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గిరిజన ఎంపిటిసిలు, సర్పంచ్‌లతో కలిసి ఆమె విలేకరులతో మాట్లాడారు. టిడిపి ఎస్‌టి సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ధారునాయక్ రాజన్నదొరపై చేసిన ఆరోపణపై ఆమె తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. టిడిపి నాయకులు మతి భ్రమించి ప్రజాక్షేత్రంలో ఎలాగో గెలవలేమని, ఏం చేయాలో అర్థం కాకపోవడంతో ఎవరైతే వైసిపిలో బలమైన నాయకులు ఉంటారో వారిపై ఇలాంటి చౌకబారు విమర్శలు చేస్తున్నారన్నారు. గిరిజనులకు అన్యాయం జరిగితే పార్టీలకు అతీతంగా వారి తరపున నిస్వార్థంగా పోరాటం చేసే వ్యక్తి రాజన్న దొర అన్నారు. మంత్రి ఆరోపణలు చేసిన ధారునాయక్ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో సర్పంచులు చెల్లూరి సీతారాం, కొర్ర బుచ్చిబాబు, చోడిపల్లి సుందరరావు, ఎంపిటిసి సభ్యులు కాదల అన్నపూర్ణ, మదల సత్యవతి, తోకల లక్ష్మి, తాడంగి సింహాచలం తదితరులు ఉన్నారు.

పోషకాహారంపై అవగాహన పెంపొందించుకోవాలి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

రాష్ట్రీయ పోషణ మాహ్ ఈనెల 30 వరకు నిర్వహించనున్నట్టు ఐసిడిఎస్ పిడి కె విజయగౌరి తెలిపారు. రాష్ట్రీయ పోషణ మాహ్ కార్యక్రమాన్ని మండలంలోని నర్సిపురం అంగన్వాడి కేంద్రంలో మంగళవారం నిర్వహించారు. గర్భిణులు, శిశువులు, బాలలు, కిశోర బాలికలు తదితర వర్గాలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ కార్యక్రమం చేపట్టడం జరుగుతోందన్నారు. “సుపోషిత్ భారత్, సాక్షర భారత్, సశక్త భారత్” శీర్షికన రాష్ట్రీయ పోషణ మాహ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. శిశువులకు తల్లి పాలు, అదనపు ఆహారం అందించడం, పౌష్టికాహారం పెంపొందించడం, రక్త హీనత వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని వివరించారు. పౌష్టికాహారం తయారీ విధానం, చిరు ధాన్యాలు వినియోగం, ఉపయోగాలు తెలియజేయడం జరుగుతుందని అన్నారు. రక్త హీనత పరిస్థితులు తెలుసుకొనుటకు చిన్నారులకు, గర్భిణీలకు, పునరుత్పత్తి దశలో ఉన్న మహిళల వివరాలు తెలుసుకొనుటకు మురికివాడలు, ఇతర ప్రాంతాలలో శిబిరాలను నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సాలూరు : ఈ నెలాఖరు వరకు పోషణ మహా మహోత్సవాలపై అవగాహన కల్పిస్తూ ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని పట్టణ అంగన్వాడీ కార్యకర్తలు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఒ బి.సత్యవతి ఆధ్వర్యాన అంగన్వాడీ కార్యకర్తలు గుమడాం నుంచి పెద హరిజనపేట వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా సిడిపిఒ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల ద్వారా పంపిణీ చేస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎసిడిపిఒ మంగతాయారు, సూపర్ వైజర్లు రవణమ్మ, భారతి, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు బి.రాధ పాల్గొన్నారు.

సీతానగరం : మండలంలోని గుచ్చిమిలో ప్రోషక మహోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ సూపర్వైజర్ సుగుణ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల ద్వారా సరఫరా చేస్తున్న పౌష్టికాహారాన్ని సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, అంగన్వాడీ కార్యకర్తలు, బాలింతలు, పిల్లలు పాల్గొన్నారు.

సాలూరులో ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీలు

గుమ్మలక్ష్మీపురం : పౌష్టికాహారం తో ఆరోగ్యవంతమైన జీవితం ఉంటుందని, గర్భిణీలు, బాలింతలు తప్పనిసరిగా పోషక విలువలతో కూడిన పౌష్టికాహారం తీసుకోవాలని భద్రగిరి ఐసిడిఎస్ సిడిపిఒ సిహెచ్ సుశీల దేవి కోరారు. పౌష్టికాహార మాసోత్సవాలు సందర్భంగా గుమ్మలక్ష్మీపురంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా భద్రగిరి ప్రాజెక్టు పరిధిలో ఉన్న గుమ్మలక్ష్మీపురం, తాడికొండ, రేగిడి, దుడ్డుఖల్లు, కేదారి పురం సెక్టార్ల అంగన్వాడీ కార్యకర్తలు తయారు చేసిన పౌష్టికాహార పదార్థాలను ప్రదర్శనగా ఉంచారు. వీటిలో గుమ్మ లక్ష్మీపురం సెక్టార్ సభ్యులు తయారుచేసిన పౌష్టికాహారానికి మొదటి బహుమతి వచ్చింది. ఈ కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

వీరఘట్టం: గర్భిణీ సమయంలో ఎక్కువగా పోషకాహారం తీసుకుంటే తల్లులతో పాటు పిల్లలు కూడా ఆరోగ్యవంతులుగా ఉంటారని స్థానిక సిడిపిఓ బి షిమ్మలమ్మ గర్భిణీలకు సూచించారు. మండల కేంద్రంలోని ఒకటి, రెండు సెక్టార్ పరిధిలో నిర్వహించిన పోషక ఆహార వారోత్సవ కార్యక్రమంలోమాట్లాడారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు ఎన్.రాజేశ్వరి, జె.జ్ఞానమ్మ, అంగన్వాడి కార్యకర్తలు, గర్భిణీలు బాలింతలు పాల్గొన్నారు.

సామూహిక మరుగుదొడ్లు నిర్మించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

స్థానిక పట్టణ ప్రధాన రహదారిలో సామూహిక మరుగుదొడ్లు నిర్మించాలని మున్సిపల్ చైర్ పర్సన్ బోను గౌరీశ్వరికి సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో రాయగడ రోడ్ నుండి, బెలగాం శివారు వరకు సామూహిక మరుగుదొడ్లు లేక, పట్టణవాసులతో పాటు గ్రామీణ ప్రాంతవాసులు, జిల్లా వాసులు, ఇతరులు ప్రతిరోజూ పలు పనులపై పట్టణానికి వివిధ అవసరాల నిమిత్తం వస్తూ వెళ్లిపోతుంటారని, వీరికి మలమూత్ర విసర్జన చేయడానికి ఎక్కడా అవకాశం లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ముఖ్యంగా మహిళలు చాలా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. స్పందించిన చైర్ పర్సన్ బోను గౌరీశ్వరి ప్రతిపాదనలు ఉన్నాయని, త్వరలో కార్యరూపం జరుగుతుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కమిటీ కార్యదర్శి గొర్లి వెంకటరమణ, రెడ్డి శ్రీదేవి, పాకల సన్యాసిరావు, బంకురు సూరిబాబు, సంచాన ఉమా మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పశువులశాల కూలి ఆవు మృతి

ప్రజాశక్తి - బలిజిపేట

మండలం లోని వెంగాపురంలో నల్ల అప్పలనాయుడుకు చెందిన పశువులశాల ఇటీవల కురుస్తున్న వర్షాలకు కూలిపోయింది. దీంతో అందులో ఉన్న పాడి ఆవు మృతి చెందింది. విషయం తెలుసుకున్న స్థానిక ఎంపిటిసి గులుపల్లి మురళి ఆ కుటుంబాన్ని ఓదార్చి కావాల్సిన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.

నిత్యావసర సరుకుల సరఫరాకు టెండర్లు

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఐటిడిఎకు అనుబంధంగా ఉన్న ఆశ్రమ పాఠశాలకు, గురుకుల పాఠశాలకు, పోస్ట్ మెట్రిక్ వసతి గృహాలకు జిసిసి ఆధ్వర్యంలో మంగళవారం ఐటిడిఎలో టెండర్లు నిర్వహించారు. వివిధ పాఠశాలలకు 52రకాల నిత్యవసర సరుకులు సరఫరా చేయడానికి టెండర్లు నిర్వహించగా ఏడుగురు వ్యాపారస్తులు పాల్గొన్నారు. నాణ్యమైన వస్తువులు సకాలంలో హెూల్సేల్ ధరలకు సరఫరా చేయాలని అధికారులు సూచించారు. ఈ టెండర్లులో ఎపిఒ వై.రోషిరెడ్డి, డిడి ఎం.శ్రీనివాసరావు, జిసిసి డిఎం జి.సంధ్యారాణి, ఎటి డబ్ల్యూఒ జి.మంగవేణి, కృష్ణవేణి, సీతంపేట, పాతపట్నం జిసిసి మేనేజర్లు దాసరి కృష్ణ, గొర్లే నరసింహులు సూపరిండెంట్ రాము దేశ్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - సీతానగరం

ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు మండల నాయకులు జి.వెంకటరమణ కోరారు. సీతానగరం, పెదఅంకలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశాడే సందర్భంగా వినుతుల అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశా కార్యకర్తలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని రిటైర్మెంట్ బెనిఫిట్ కల్పించాలని డిమాండ్ చేశారు. సిఐటియు నాయకులు మాట్లాడుతూ ఆశా కార్యకర్తలపై రాజకీయ వేధింపులు, పని భారం పెరిగిందన్నారు. ఈ సమస్యలన్నీ పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు రెడ్డి లక్ష్మునాయుడు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు

కొమరాడ : ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కారం చేయాలని సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు కొమరాడ, కూనేరు రామభద్రపురం పిహెచ్‌సిల వద్ద ధర్నా నిర్వహించారు. ధర్నా అనంతరం వైద్యాధికారులకు వినతులు అందజేశారు. కార్యక్రమంలో ఆశా వర్కర్ల యూనియన్ నాయకులు రాజేశ్వరి, పార్వతి, హైమా, గౌరి, పలువురు ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పాచిపెంట : ఆశా వర్కర్లకు కనీస వేతనం చెల్లించాలని, రాజకీయ వేధింపులు మానుకోవాలని ఉద్యోగ భద్రత కల్పించాలని సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు డిమాండ్ చేశారు. ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు నాగవేణి, కె.నిర్మల అధ్యక్షతన పాచిపెంట, గురువు నాయుడుపేట పిహెచ్‌సి వద్ద నిరసన తెలిపారు. అనంతరం వైద్యాధికారులకు వినతులు అందజేశారు. కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు కె.మంజుల, పి.నిర్మల, గిరిజన సంఘం జిల్లా కమిటీ సభ్యులు మంచాల శ్రీనివాసరావు, పలువురు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సీతానగరంలో నిరసన తెలుపుతున్న ఆశా కార్యకర్తలు

పకడ్బందీగా క్రీడలు నిర్వహించాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఈనెల 7నుంచి జరగనున్న మండల స్థాయి క్రీడా పోటీలను పకడ్బందీగా నిర్వహించాలని ప్రధాన ఉపాధ్యాయులు ఎస్ సుంభోర వ్యాయమ ఉపాధ్యాయులకు ఆదేశించారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో వ్యాయమ ఉపాధ్యాయులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, బాల్‌బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్, షటిల్, టెన్నీకాయిట్, యోగా అండర్ 14, 17 బాలురు, బాలికల క్రీడా పోటీలు నిర్వహిస్తామన్నారు. ఆసక్తి గలవారు పేర్లను నమోదు చేసుకోలని ఆయన కోరారు. సమావేశంలో జిల్లా వ్యాయమ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షులు ఎం.రామకృష్ణ, ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

గొయ్యిలు పూడ్చివేత

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక మార్కెట్ కూడలిలో గల రోడ్డుపై ఏర్పడిన పెద్దపెద్ద గొయ్యిలను ఆర్అండ్‌బి అధికారులు పూడ్చుతున్నారు. ఈ రోడ్డు మరమ్మతులపై స్థానిక ఎమ్మెల్యే ఎ.జోగారావు సోమవారం స్పందన కార్యక్రమంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు స్పందించిన అధికారులు మంగళవారం ఆర్ అండ్ బి ఎఇ రామ్మోహనరావు ఆధ్వర్యాన స్థానిక నాయకుల సూచనల మేరకు ప్రధానగోతులను పూడ్చుతున్నారు.

In the Honourble Court of the Senior Civil Judge at Parvathipuram
SOP 4/2023

Between:
Reddi Alivelu
Reddi Lava Kumar ....Petitioners
And :
Nill .....Respondents

పై నెంబరు గల దావాలో యిందలి 1st పిటిషనరు భర్తగారు మరియు 2nd పిటిషనర్ తండ్రి గారైన శ్రీ రెడ్డి రామకోటిగారు 23-09-2021నాడు మరణించినందున ఇందలి తెలిపిన పిటిషనర్స్ మాత్రమే చనిపోయిన రెడ్డి రామకోటి గారి యొక్క ముఖ్య వారసులు అయి ఉన్నందున ఈ పిటిషనర్లుకు Succession Certificate, Bank of Baroda Nacharam Branch Hyderbad వారు కోరి ఉన్నందున పై Succession Certificate యిప్పించవలసినదిగా పై కోర్టులో పిటిషను దాఖలు చేయడమైనది.

కావున ఎవ్వరికైనా ఆక్షేపణలున్న ఎడల **తేదీ 12-9-2023దీన ఉదయం 10-30 గం॥లకు** పై కోర్టులో తెలియజేయవలెను. లేని ఎడల మీ పరోక్షమున తీర్మానించడమగునని, యిందుమూలంగా తెలియజేయడమైనది.

కోర్టు ఆదేశానుసారంగా
S.Uma Maheswara Rao,
Advocate/Notary,
Parvathipuram,
Cell: 9866056037